క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



శివపార్వతులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల కేంద్రంలో శ్రీ పర్వతవర్ధినీ శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శివ పార్వతుల గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి వారిపై ప్రజలకు విశ్వాసం.

బాల కార్మికులకు విద్యనందించాలి



విద్యార్థినికి పుస్తకాలు, వాటర్ బాటిల్స్ అందిస్తున్న సారథి

రైల్వేకోడూరు అర్బన్ : బాల కార్మికులను గుర్తించి వారికి విద్యనేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గ్లోబల్ సర్వీస్ ట్రస్టు మేనేజర్ పార్థసారథి సోమవారం తెలిపారు. సుమారు 20 మంది బాల కార్మికులను గుర్తించి వారిని పట్టణంలోని రెండోవార్డు పాఠశాలలో చేర్పించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి, మురళీలు చేతులమీదుగా పిల్లలకు స్కూల్ బ్యాగ్, పుస్తకాలు అందజేశారు.

భుజంగేశ్వరునికి పూజలు



అలంకారంలో భుజంగేశ్వరుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో సోమవారం అర్చకులు పవన్ కుమార్, పృథ్వీల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేసి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సబ్ పోస్టు మాస్టర్ బదిలీ



సబ్ పోస్టుమాస్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ పోస్టుమాస్టర్ ఉరుముల జగదీష్ సోమవారం బదిలీ అయ్యారు. కోడూరు మండలం పెద్ద రాచపల్లెకు బదిలీ కాగా రాజంపేట మండలం, మన్నూరు తపాలా కార్యాలయంలో పని చేస్తున్న రామ్మోహన్ నాయక్ పెనగలూరుకు బదిలీపై విచ్చేశారు. దీంతో పెనగలూరు తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది జగదీష్‌ను ఘనంగా సన్మానించారు. దుశ్శాలువా కప్పి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా పెనగలూరు పనిచేసినప్పుడు బ్రాంచ్ పోస్టుమాస్టర్లు తమకు ఎంతో సహకరించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్యాకర్ సుబ్బరాయుడు, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు కరుణాకర్‌రెడ్డి, శివశంకరయ్య, పెంచలయ్య, విజయమ్మ, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె : ఈ నెల 29న జరగబోవు జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి హైజున్నీషా తెలియజేశారు. సోమవారం స్థానిక లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో వివిధ మండలాల పోలీస్ సిబ్బంది సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ మెగాలోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఎక్కువ కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, వివిధ మండలాల పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించి పరిష్కరించాలి

మండల సమావేశంలో అధికారులకు సూచించిన ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి జెడ్పీటీసీ రమాదేవి, ఎంపీడీఓ వెంకటరమణరెడ్డిలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖలవారీగా సమస్యలపై ఆరా తీశారు. రైతులకు అదనంగా విత్తనకాయలు పంపిణీ చేయాలని సభ్యులు కోరారు. ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. జీలుగలు కావాలని సభ్యులు కోరగా అందుబాటులో లేవని అధికారులు తెలిపారు. ఈ ఏడాది 5121 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా వారికి సంబంధించిన విద్యా సామగ్రిని సకాలంలో అందించాలన్నారు. చింతకుంట వాండ్లపల్లె వద్ద ఏర్పాటు చేసిన లే అవుట్‌ను సిద్ధం చేస్తే అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేయవచ్చని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు ఎప్పటికప్పుడు గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. దోమల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలని సభ్యులు కోరారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో గొర్రెలు, మేకలు, పశువులకు రోగాలు వచ్చే అవకాశం ఉన్నందున టీకాలు వేయించాలని, ఇన్సురెన్స్ చేయించేలా చూడాలన్నారు. టౌన్ పరిధిలోని నలంద నగర్ ఏరియాలో నీరు సరిగా రావడం లేదని సభ్యులు తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను బాలసదనం స్కూల్‌లో చేర్పించే సదుపాయం కల్పించాలని సభ్యులు ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. ఈ మధ్య కురిసిన వర్షానికి, గాలులకు గ్రామాలలో విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయని, కావున వెంటనే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సభ్యులు తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు కత్తెర్లు, రంపాలు అందించాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు రౌత్ నాగలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, కోదండ శ్రీలత, రామసుబ్బమ్మ, లక్ష్మీనారాయణ, రాధ, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కల్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, నాగిరెడ్డి, సంధ్యారాణి, బాబు, పీఆర్ఏఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారి రమేష్ బాబు రావు, ట్రాన్స్‌కో ఏఈ రంగనాథ్, ఉద్యానశాఖ అధికారి నాగమణి, వెలుగు ఏపీఓ నిరంజన్, కోనంపేట, దేవలంపల్లె పీహెచ్‌సీ వైద్యులు సిద్దయ్య, సుమలత, ఏపీఓ పెంచలయ్య, ఈఓపీఆర్‌డీ పట్నాయక్, ఆర్‌ఐ సమ్మత్ ఖాన్, వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు

ఎన్‌సీసీ విద్యార్థులకు ధృవపత్రాల అందజేత



ఎన్‌సీసీ ధృవపత్రాలతో విద్యార్థులు

చిట్వేలి : చిత్తూరులో శిక్షణ ముగించుకున్న ఎన్‌సీసీ విద్యార్థులకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ధృవపత్రాలు పంపిణీ చేశారు. 30వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ చిట్వేలి ట్రూప్ విద్యార్థులు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ఎన్‌సీసీ కంబైన్డ్ వార్షిక శిక్షణా శిబిరం చిత్తూరులో 10 రోజులపాటు శిక్షణ ముగించుకున్నట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్‌లు తెలియజేశారు. పదిరోజుల శిక్షణలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల విద్యార్థులతో కలిసి వెపన్ ట్రైనింగ్, డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, వ్యక్తిత్వ వికాసం, గుడార నిర్మాణం మొదలగు వాటిపై విద్యార్థులు శిక్షణ పొందారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు నాగ సాత్విక, సాహితీ, రక్షిత, సాదక్, హరికుమార్, నాగశివలకు శిక్షణా ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి 9 నెలల 26 దినాలు అయిందని, సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలో ఏదో అవకతవకలు జరిగాయని ప్రతి రోజు ప్రచురణలు జరుగుతున్నాయని, ఇది సమంజసం కాదన్నారు. మా లెక్కలు ఏ ఆడిటర్‌కైనా చూపించడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పీలేరు గ్రామ పంచాయతీకి రావలసిన ఆదాయం ఎన్నికల నిబంధనల ప్రకారం పన్నులు వసూలు కాలేదని, అయినా మేము కరెంటు సమస్య గాని, మురుగు నీటి కాలువల సమస్య, నీటి సమస్య రాకుండా కార్మికుల సహకారంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్మిక సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి, పెట్రోలు, ఇతర సామగ్రి కొనుటకు నెలకు రూ. 23 లక్షలు ఖర్చు అవుతోందని చెప్పారు. పాత అప్పులు దాదాపు రూ.3 కోట్లు ఉన్నాయని, పాత కాంట్రాక్టర్లకు, పని చేసిన వారికి చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా పంచాయతీలో లెక్కలు చూసుకుని నిజానిజాలు ప్రచురించాలని కోరారు.

జాతీయస్థాయిలో ఏయూ విద్యార్థుల ప్రతిభ



అవార్డును అందుకుంటున్న కో-ఆర్డినేటర్ కిషోర్

రాజంపేట : స్వయం నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నికల్ ఎన్‌హ్యాన్స్ అండ్ లర్నింగ్ పరీక్షలో అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభను చాటారు. జాతీయస్థాయిలో ఉన్న ఐఐటీ, ఎన్‌ఐటీ యూనివర్సిటీలతో పోటీపడి 67వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ 8 మంది టాపర్స్ గాను, ఒకరు గోల్డ్‌టాపర్ గాను, 223 మంది సిల్వర్ టాపర్, 705 మంది ఎలైట్ సాధించారన్నారు. కాగా ప్రతిభ చాటిన వారిని ఎన్‌పీటీఈఎల్ కో–ఆర్డినేటర్ డా.కిషోర్, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు అభినందించారు. ఈనెల 22న ఎన్‌పీటీఎల్ లోకల్ చాప్టర్ ఎస్‌పీఓసీ ఫెలిస్టేషన్ కమ్ అవేర్‌నెస్ వర్క్‌షాపులో 67వ ర్యాంకు వచ్చినందుకు కో–ఆర్డినేటర్ నంద్యాల కిషోర్‌కుమార్ అవార్డును అందుకున్నారు.

సీఆర్‌పీల ఎంపికకు రాతపరీక్ష

తంబళ్లపల్లె : ఎస్ఆర్ఎల్ఎం, సెర్ప్ ఆధ్వర్యంలో వ్యవసాయేతర జీవనోపాధుల కల్పనకు ఉప పథకాల అమలు చేసేందుకు సీఆర్‌పీలను ఎంపిక చేసేందుకు సోమవారం స్థానిక స్త్రీ శక్తిభవనంలో డీపీఎం రూతూ పర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల నుంచి 70 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అర్హత సాధించిన వారిని 4 గ్రామ పంచాయతీలకు ఒక సీఆర్‌పీని నియమించనున్నట్లు డీపీఎం తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె పంచాయతీలో వడ్ల తురకపల్లెకు సమీపంలో సర్వేనెంబరు 2731లో ఐదు ఎకరాలు భూమి తన పేరుతో, సర్వే నెంబరు 3732/2లో తన కుమారుడు పేరుతో ఉన్న భూమిని రెడ్డయ్య అనే వ్యక్తి దౌర్జన్యంగా జేసీబీతో చదును చేసి ఆక్రమించాడని సుండుపల్లె మండల కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన షేక్ అహ్మద్ బాషా సోమవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన తమ భూమి పక్కనే పొలం ఉన్న రెడ్డయ్య అనే వ్యక్తి ఆక్రమించాడంటూ సుండుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంత వరకు రెడ్డయ్యపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎస్పీకి తెలియజేశారు. తమ భూమిని ఎందుకు ఆక్రమించావని ప్రశ్నిస్తే మిమ్ముల్ని కూడా జేసీబీతో తొక్కిస్తానంటూ బెదిరించడమే కాకుండా నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూమిని ఆక్రమించిన రెడ్డయ్యపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అహ్మద్ బాషా జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు చిరుకానుక

మదనపల్లె సిటీ : బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నామా చంద్రశేఖర్ సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు మత సామరస్యం తెలియజేసే ఫొటోను హెచ్ఎం సుబ్బారెడ్డికి అందజేశారు. తన కుమారుడు ధీరజ్ 8 నుంచి 10 వరకు చదువుకున్నందుకు చిరుకానుక అందజేసినట్లు తెలిపారు. అలాగే ఎంఆర్‌సిలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీవైఈఓ కార్యాలయంలో డీవైఈఓ శ్రీరాం పురుషోత్తంకు ఫొటోలను అందజేశారు.

ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం



ఐక్యత చాటుతున్న ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలోని అన్ని ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు, న్యాయవాదులు, ఉన్నత మేధావి వర్గాలను కలుపుకుని మరొకసారి ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రియాదవ్ అన్నారు. సోమవారం స్థానిక విశ్వహిత డిగ్రీ కాలేజీలో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విభజన హామీ చట్టాలను అమలు పరిచేలా ఉద్యమాలు చేస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, పరిశ్రమలు స్థాపించాలని డిమాండ్ చూస్తూ ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటిలు పూర్తి చేసి కార్యాచరణ అజెండాను కూడా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలోఏపీ స్టూడెంట్స్ జేఏసీరాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉత్తన్న ,తిరుపతి జిల్లా అధ్యక్షులు శ్రీధర్, గణేష్, నారాయణ, ప్రదీప్, పురుషోత్తం, మల్లికార్జున పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులుగా గంగారాజును నియమిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం

రామసముద్రం: మండలంలోని మినికి బండపై వెలసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వైభవంగా స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి కలశారాధన, హోమం, బలిహరణ, మహా మంగళహారతి, వాహనసేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: డయేరియా (అతిసార వ్యాధి)పై అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డయేరియాపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోయినా, మురుగు కాలువల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు ప్రబలి, కలుషిత నీరు, ఫుడ్ పాయిజన్ లాంటి కారణాలతో వాంతులు, విరేచనాలకు దారి తీస్తాయన్నారు. ఇందుకు తగ్గట్టు అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్: నీట్ పరీక్ష 2024 ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్న అనుమానాలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్), విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్న, వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నగిలి రాజేంద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనో మాట్లాడారు.

నీట్ పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, అంజి, వినయ్, చరణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి అభినందనలు

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఢిల్లీలో ఎంపీని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మూడోసారి ఎంపీగా గెలుపొందడం తోపాటు అత్యధిక మెజారిటీ సాధించినందుకు వైఎస్సార్ సీపీ యువ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, హరీష్ రెడ్డి, భీరేంద్రవర్మ, బి.వి.ఆర్. చౌదరి, శ్రీనురాజు, రాహుల్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళి సమేతుడు



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు, అధికారులు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం రంగురంగల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢ వీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు జరిపించారు. పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్న ప్రసాదం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 అర్జీలు



తహసీల్దారు మురాషావలి

సిద్దవటం : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి 7 అర్జీలు వచ్చాయని తహసీల్దారు మురాషావలి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లె నుంచి ఆక్రమణలను తొలగించాలని 2 అర్జీలు, పట్టాదారు పాసు పుస్తకాల మార్పు కోసం 5 అర్జీలు రావడంతో వాటిని స్వీకరించామన్నారు. ఈ మేరకు విచారణ చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపుతామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ అనూరాధ, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

గాలివీడు : కార్యకర్తలు, నాయకులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ సభా భవనంలో మాట్లాడుతూ జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఓటమి పట్ల కార్యకర్తలు, నాయకులకు నిరుత్సాహం అవసరం లేదని, ఎన్నికలలో గెలుపు, ఓటమిలు సహజమేనన్నారు. ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడూ స్పందిస్తూ ఉండాలని తెలియజేశారు. పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేద్దామని తెలియజేశారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలలో పారిశుధ్యం పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్రారెడ్డి

వీరబల్లె : మండలంలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు వెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, అసిస్టెంట్ ఇంజనీర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాలలో మురికి వర్షపునీరు నిలబడి పారిశుధ్యం లోపించే అవకాశం ఉందన్నారు. దీని వలన దోమలు నిల్వ ఉండి ప్రజలకు జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామాలలో ప్రభుత్వం నిర్మించిన వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలని సూచించారు. గ్రామాలలో నిల్వ ఉన్న మురికి నీటి వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న వేణుగోపాలుడు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రంలో కొలువైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం వేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం వారు ఉభయదాతలుగా అలకలదోపు కార్యక్రమం జరిగింది. ఆదివారం రాత్రి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర హరికథా కాలక్షేపానికి విశేష స్పందన లభించింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం పోలిశెట్టివారు ఉభయదాతలుగా వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. మంగళవారం రాత్రి చివరి హరికథా కాలక్షేప కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షం పొందగలని వారు కోరారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

అమెరికా విద్యా విధానం అమల్లోకి తేవాలి



సభలో మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో అమెరికా విద్యా విధానం అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. లేదంటే ప్రభుత్వ బడుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె హైస్కూల్ హెడ్‌మాస్టార్ దుగ్గరాజు కాంతారావు ఉద్యోగ విరమణ సభ జరిగింది. దీనికి హజరైన కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో అధ్యక్షుని కుటుంబమైనా, ధనికులైనా, పేదలైనా వారి స్వస్థలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలన్న నిబంధన ఉందని, దీనివల్ల ఎక్కడివారు అక్కడి పాఠశాలల్లో విద్యనభ్యసిస్తారన్నారు. దీనివల్ల ప్రభుత్వ బడులు బలోపేతం అయినట్లు చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో చదవాల్సిన విద్యార్థులు స్వస్థలాలను వదిలి దూరంగా ఉన్నా ప్రైవేటు పాఠశాల్లో చేరుతున్న కారణంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అయ్యి మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటలను విద్యార్థులు పాటిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గోళ్లపల్లె హైస్కూల్‌కు అదనపు తరగతి గదులు మంజూరు అయ్యి, నిర్మించేదాక పట్టువదలకుండా హెచ్ఎం కాంతారావు కృషి చేయడం వల్లే అభివృద్ధి జరిగిందన్నారు. అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు. అనంతరం కాంతారావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆర్.రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ, శ్రీనివాసులు, త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, రామకృష్ణ, నారాయణ, సుబ్రమణ్యం, హెచ్ఎంల సంఘం అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, గంటా మోహన్, అశోక్‌కుమార్, సర్పంచు రుక్మిణి, హెచ్ఎం శ్రీరాములు పాల్గొన్నారు.

మహబూబ్ సుబహాని దర్గా ఉరుసు

పీలేరు రూరల్ : స్థానిక జెండామాను వద్ద హజరత్ మహబూబ్ సుబహానివారి 78వ ఉరుసు ఉత్సవం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా జెండామాను మినారు వద్ద పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరణ, చదివింపులు చేపట్టారు. సోమవారం గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉరుసులో భాగంగా మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ప్రముఖ ఖవ్వాలీలచే పాటకచ్చేరి నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉరుసు ఉత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.